@netifocusnews @focustv
www.netifocusnews.com
http://epaper.netifocusnews.com
TS-18-0006625

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

FOCUS TELUGU TV అనునిత్యం - ప్రజాపక్షం

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || మంగళవారం 01, అక్టోబర్ 2024 || పేజీలు: 04





# ప్రజల ఆకాంక్ష మేరకే ప్రజాపాలన

- 1:3 నిష్పత్తిలో వెరిఫికేషన్
- దసరాలోపు నియామకాలు
- పదేళ్లలో విద్యా రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది
- నీళ్ళు,నిధులు, నియామకాలతో పాటు విద్య కూడా తెలంగాణాకు ఓ భావోద్వేగం
- గత ప్రభుత్వ హయాంలో బడ్జెట్ కేటాయింపుల్లో విద్యా శాఖకు అన్యాయం జరిగింది.
- మా ప్రభుత్వం వచ్చాక విద్యా శాఖకు బడ్జెట్ పెంచాం
- భవిష్యత్తులో ఇంకా పెంచుతాం
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




## డీఎస్సీ ఫలితాలు విడుదల చేసిన సీఎం రేవంత్..

(నేటి ఫోకస్ న్యూస్), హైదరాబాద్-సెప్టెంబర్ 30:

ప్రజా ప్రభుత్వం రికార్డు సమయంలో డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీ డీఎస్సీ 2024 ఫలితాలను ప్రకటించింది. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి ఫలితాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులకు అభినందనలు మిగతా 2లో..




# అన్ని సేవలకు ఒకటే డిజిటల్ కార్డు

- 3నుంచి 7వరకు పైలెట్ ప్రాజెక్ట్‌గా క్షేత్ర స్థాయి పరిశీలన
- రాష్ట్ర వ్యాప్తంగా 238 ప్రాంతాల్లో 5రోజుల పాటు సాగనున్న ప్రక్రియ
- పట్టణ/నగర ప్రాంతాల్లో జనాభా ఆధారంగా ఎక్కువ టీమ్‌లు
- కుటుంబ ఫొటో దిగడం ఆప్షన్ మాత్రమే..
- ఫ్యామిలీ డిజిటల్ కార్డ్‌లపై సచివాలయంలో అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష

(నేటి ఫోకస్ న్యూస్), హైదరాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 30:


తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి సంబంధించి 119 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టనున్న ప్రక్రియను సమర్థంగా చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రతి నియోజకవర్గం పరిధిలో ఒక పట్టణ, ఒక గ్రామీణ ప్రాంతాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఒక వేళ పూర్తిగా పట్టణ/నగర నియోజకవర్గమైతే రెండు వార్డులు/ తీసుకోవాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయి పరిశీలనకు సంబంధించి ఉమ్మడి జిల్లాలకు ఉన్న నోడల్ అధికారులు కలెక్టర్లకు మార్గనిర్దేశం చేయాలని.. అప్పుడే పకడ్బందీగా కార్యక్రమం కొనసాగుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. మిగతా 2లో..

# పేదల బతుకు ముఖ్యమా.. సుందరీకరణ ముఖ్యమా?

- ఆరు గ్యారంటీలు ఏమయ్యాయి
- హైడ్రా కాదు.. ముందు గ్రామాల్లో అభివృద్ధి చూడాలి
- ఆటో కార్మికులకు ఖాకీ యూనిఫాం అందజేత
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

(నేటి ఫోకస్ న్యూస్) సిద్దిపేట, సెప్టెంబర్ 30:

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు అతీగతీ లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. 1.5 లక్షల కోట్లు పెట్టి మూసీ సుందరీకరణ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని.. దీనికోసం 25 వేల ఇండ్లు కూల్చేందుకు సిద్ధమయ్యారని అన్నారు. ఆటో క్రెడిట్ కో మిగతా 2లో..




# రేవంత్ రెడ్డి ఒక అన్‌ఫిట్..

- పేదలు, మధ్య తరగతి వాళ్లకు ఇళ్లు అనేది ఒక ఎమోషన్
- పేదల ఇళ్లు కూల్చి.. పెద్ద, పెద్ద మాల్స్ కడుతావా?
- బుల్డోజర్లకు అడ్డుగా మేముంటాం..
- మూసీ బాధితులకు కేటీఆర్ పరామర్శ

2

# మీ ఇష్టం వచ్చినట్టు కూల్చేస్తారా?






## అత్యుత్సాహం వద్దంటూ హెచ్చరిక

- హైడ్రా చీఫ్ రంగనాథ్‌పై మండిపడ్డ హైకోర్టు
- శని, ఆదివారాల్లో పనిచేయాల్సిన అవసరం ఏమొచ్చింది..
- ఉరితీసే ముందు కూడా చివరి కోరిక అడుగుతారు..
- ఇళ్లను కూల్చేసేముందు బాధితులకు చివరి అవకాశం ఇచ్చారా?
- హైడ్రా ఏర్పాటు జీవోపై స్టే ఇవ్వాల్సి వస్తుంది

2




# ప్రజల ఆకాంక్షల మేరకే ప్రజాపాలన

(మొదటి పేజీ తరువాయి..)

తెలియజేశారు. దసర పండుగ శుభ సందర్భాన్ని దృష్టిలో పెట్టుకుని ఎంపికైన అభ్యర్థులకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసి అక్టోబర్ 9న నియామకపు పత్రాలు అందజేస్తామని ప్రకటించారు. డా.బీఆర్ అబేంద్కర్ సచివాలయంలో డీఎస్సీ ఫలితాల విడుదల అనంతరం ముఖ్యమంత్రి విద్యా రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2012 లో ఒకసారి, తెలంగాణ ఏర్పడిన తర్వాత గడిచిన పదేళ్లలో 2017 లో ఒకే ఒక్కసారి అదికూడా కేవలం 7,857 పోస్టులకు మాత్రమే డీఎస్సీ నిర్వహించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 90రోజుల్లో 30వేల పోస్టులను భర్తీ చేశాం. వ్యవస్థలను నిర్వీర్యం చేసి అంగడిగా మార్చిన టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. ప్రస్తుత టీచర్ల నియామకాలు పూర్తయిన తర్వాత ఖాళీల ఆధారంగా కొత్త నియామక ప్రక్రియ చేపడుతాం. జాబ్ క్యాలెండర్ ప్రకారం నియామకాలు నిరంతర ప్రక్రియగా సాగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న కారణంగా పాఠశాలలు మూసివేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదు.



విద్యపై ఖర్చును భవిష్యత్తుకు పెట్టుబడిగా భావిస్తాం. గడిచిన పదేళ్లలో విద్యా రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యకు నిధులు పెంచాం. ఇంకా పెంచుతాం. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వంటి గురుకులాలు ప్రారంభించారు గానీ వాటిలో కనీస సౌకర్యాలు కల్పించకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. అందుకే సామాజిక సమతుల్యత పాటిస్తూ రాష్ట్రంలోని 100 అసెంబ్లీ నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రారంభిస్తాం. ఒక్కో నియోజకవర్గంలో 100 -120 కోట్ల రూపాయల నిధులతో 20 నుంచి 25 ఎకరాల స్థలంలో సంపూర్ణమైన వసతులతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల క్యాంపస్ లను ఏర్పాటు చేస్తాం. అందులో భాగంగానే కొడంగల్, మధిరల్లో పైలట్ ప్రాజెక్టుగా మొదలుపెట్టాం. బదిలీలు, ప్రమోషన్లు లేక నిరాశా నిస్పృహలతో ఉన్న టీచర్లకు సంబంధించి 34,706 మందికి ఎలాంటి అవాంతరాలు, ఆరోపణలు లేకుండా ఆ ప్రక్రియను చేశాం. విద్య, నీళ్లు, నియామకాలు వంటివి భావోద్వేగంతో కూడినవి. త్వరలోనే గ్రూప్ 1 ఫలితాలు ప్రకటిస్తాం. ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే 60 నుంచి 65 వేల ఉద్యోగాలు భర్తీ చేయాలన్నది లక్ష్యం. గత జూలై 18 నుంచి ఆగస్టు 5 వ తేదీ మధ్య రాష్ట్ర వ్యాప్తంగా 54 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన డీఎస్సీ ఫలితాలను 55 రోజుల రికార్డు సమయంలో ప్రకటించడం పట్ల విద్యా శాఖ అధికారులకు అభినందనలు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ గారు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం పాల్గొన్నారు.

# అన్ని సేవలకు ఒకటే డిజిటల్ కార్డు

(మొదటి పేజీ తరువాయి..)

ప్రభుత్వం వద్దనున్న రేషన్ కార్డు, పింఛను-స్వయం సహాయక సంఘాలు, రైతు భరోసా, రుణమాఫీ, బీమా, ఆరోగ్య శ్రీ, కంటి వెలుగు తదితర డేటాల ఆధారంగా ఇప్పటికే కుటుంబాల గుర్తింపునకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందని, పైలెట్ ప్రాజెక్టులో దానిని నిర్ధారించుకోవడంతో పాటు కొత్త సభ్యులను జత చేయడం, మృతి చెందిన వారిని తొలగించడం చేస్తామని అధికారులు వివరించారు. కుటుంబ సభ్యుల వివరాల నమోదు, మార్పులు చేర్పుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఎటువంటి పొరపాట్లకు తావివ్వవద్దని హెచ్చరించారు. పైలెట్ ప్రాజెక్టుతో బయటకు వచ్చిన సానుకూలతలు, ఎదురైన ఇబ్బందులతో నివేదిక తయారు చేయాలని డివిజన్లు, పూర్తిగా గ్రామీణ నియోజకవర్గమైతే రెండు గ్రామాల్లో మొత్తంగా 238 ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. వార్డులు/డివిజన్లలో జనాభా ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పరిశీలన బృందాల సంఖ్యను పెంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డులకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిట్ కార్డుల పైలెట్ ప్రాజెక్టు, సేకరించే వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 119 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనున్న గ్రామాలు, వార్డులు/డివిజన్ల ఎంపిక పూర్తయిందని అధికారులు సీఎంకు వివరించారు. పైలెట్ ప్రాజెక్టును ఎన్ని రోజుల పాటు చేపడతారని సీఎం ప్రశ్నించారు. అక్టోబరు మూడో తేదీ నుంచి ఏడో తేదీ వరకు అయిదు రోజుల పాటు చేపడతామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు అంతా సమ్మతిస్తే కుటుంబం ఫొటో తీయాలని, అదో అప్షనల్‌గా ఉండాలని, కుటుంబం సమ్మతి లేకుంటే ఆ ఫొటోముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఆ నివేదికపై చర్చించి లోపాలను పరిహరించిన అనంతర పూర్తి స్థాయి క్షేత్ర స్థాయి పరిశీలన చేపడదామని ముఖ్యమంత్రి తెలిపారు. సమీక్షలో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యదర్శులు సంగీత సత్యనారాయణ, మాణిక్ రాజ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి ఒక అన్‌ఫిట్..

(నేటి ఫోకస్ న్యూస్), హైదరాబాద్-సెప్టెంబర్30: రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని హైదర్‌గూడలో మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ బాధితులను కలిసి, వారికి అండగా ఉంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 1920 నుంచి 2020 వరకు మనకు మూసీలో ఎలాంటి సమస్య రాలేదు. 2020లో మాత్రమే ఒక్కటేసారి భారీగా వర్షం రావటంతో మూసీలో ఇబ్బందులు తలెత్తాయి అని గుర్తు చేశారు.అప్పుడు కూడా కేసీఆర్ ప్రజలకు ఇబ్బందులు పెట్టవద్దన్నారు. కానీ కాంగ్రెసోళ్లే పర్మిషన్ ఇచ్చి, వాళ్లే రిజిస్ట్రేషన్ చేసి, వాళ్లే ఇళ్లను కూలగొడుతున్నారు. ఈ ప్రభుత్వంలో కుడి చేయి ఏం చేస్తుందో.. ఎడమ చేయికి తెలియటం లేదు. రేవంత్ రెడ్డి ఒక అన్‌ఫిట్, అసమర్థ సీఎం అని మండిపడ్డారు.ఇక్కడ మార్కింగ్ ఇచ్చిన బిల్డింగ్‌లకు సంబంధించి విలువ లెక్కిస్తే దాదాపు వెయ్యి కోట్ల వరకు ప్రజల ఆస్తి ఉంటుంది. 2,400 కిలోమీటర్లు ఉన్న నమామీ గంగే ప్రాజెక్ట్ కోసం రూ. 40 వేల కోట్లు ఖర్చు చేశారు. 55 కిలోమీటర్ల మూసీకి మాత్రం రూ. లక్షా 50 వేల కోట్లంట అని ధ్వజమెత్తారు.మూసీని ప్రక్షాళన చేయమని నిన్ను ఎవరు అడిగారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు ఇస్తా అని రేవంత్ రెడ్డి అన్నాడు. మరి ఆరు గ్యారంటీలు అమలైనయా? స్టాంప్ పేపర్లు, అఫిడవిట్లు, దేవుళ్ల మీద ఒట్లు వేసి మరి హామీలు ఇచ్చారు. ఢిల్లీ కాంగ్రెస్‌కు రూ. 25 వేల కోట్లు పంపటానికే ఈ రూ. లక్షా 50 వేల కోట్లు ప్రాజెక్ట్ పెట్టుకున్నారు వాళ్ల బుల్డోజర్లకు అడ్డుగా మేముంటాం.. ధైర్యం కోల్పోకండి అని భరోసానిచ్చారు.ఇదే కాంగ్రెస్ పాలనలో గతంలో ఎప్పుడూ హైదరాబాద్‌లో కర్ఫ్యూ ఉంటుండే. కానీ కేసీఆర్ సీఎం అయ్యాక ఒక్క కర్ఫ్యూ లేకుండా బ్రహ్మాండంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకున్నాం. హైదరాబాద్‌లో లక్షల మంది వాళ్ల ఇళ్ల కోసం ఆందోళన చెందుతున్నారు. హైదరాబాద్‌లో ప్రజలు బీఆర్ఎస్‌ను గెలిపించారని కక్ష పెట్టుకొని ఈ కుట్ర చేస్తున్నారు అని కేటీఆర్ విమర్శించారు.ఉత్తర్‌ప్రదేశ్‌లో బుల్డోజర్ రాజ్ నహీ ఛలేగా అని రాహుల్ గాంధీ అంటాడు. మరి తెలంగాణలో వారి అయ్యా జాగీరా బుల్డోజర్ రాజ్ నడిపించేందుకు? సోషల్ మీడియాలో ఆయనను తిడుతున్న తిట్లు చూస్తుంటే మనిషి అనేటోడు ఎప్పుడో సచ్చిపోతుండే అని ఎద్దేవా చేశారు.నీ సొంత ఇళ్లు కూడా చెరువు, కుంటలోనే ఉంది. దాన్ని కూలగొట్టే దమ్ముందా నీకు.. దుర్గంచెరువులో వాళ్ల అన్న ఇళ్లు కూడా కూలగొట్టరంట. వాళ్ల మంత్రులు, వాళ్ల ఎమ్మెల్యేలందరి ఇళ్లు హిమాయత్‌సాగర్ చుట్టు ఉన్నాయి. నీకు నిజాయితీ, చిత్తశుద్ధి ఉంటే ముందు వాళ్ల ఇళ్లు కూలగొట్టు అని సవాల్ విసిరారు.పేదలు, మధ్య తరగతి వాళ్లకు ఇళ్లు అనేది ఒక ఎమోషన్. అలాంటి ఇళ్లను కూలగొడితే వాళ్ల ఆశలను కూలగొట్టినట్లే.. హైడ్రా కమిషనర్ సిగ్గు లేకుండా మూసీతో సంబంధం లేదని ప్రకటన చేశారు. మరి ఎందుకు మార్కింగ్ చేశారు. పీకనీకి ఈ మార్కింగ్ చేశారా? అని అడిగారు.వీ ఎరు సంఘటితంగా ఉంటేనే ఈ ప్రభుత్వంతో మనం కొట్లాడగలం అన్నారు.


## పేదల బతుకు ముఖ్యమా.. సుందరీకరణ ముఖ్యమా?

(మొదటి పేజీ తరువాయి..)

ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆటో కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆటో కార్మికులకు ఖాకీ యూనిఫాంలను హరీశ్‌రావు అందజేశారు.అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్లుగా అక్కడ నివసిస్తున్న ప్రజల ఇండ్లు కూల్చేస్తుండటంతో ప్రజలు కన్నీరు మున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి గుండె కరగడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వేల కుటుంబాలను ఆగం చేస్తున్నదని మండిపడ్డారు. పేదల బతుకు ముఖ్యమా? సుందరీకరణ ముఖ్యమా అని ప్రశ్నించారు. సీఎం నిర్ణయంతో లక్షల మంది రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా పేరిట చేస్తున్న డ్రామాలను ఆపేయాలని సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు హితవు పలికారు. రేవంత్ రెడ్డికి కూల్చడం తప్ప నిర్మించడం రాదని ఎద్దేవా చేశారు. మూసీని సుందరీకరిస్తే ఎవరి బతుకులు బాగుపడతాయని ప్రశ్నించారు. మూసీ సుందరీకరణ, హైడ్రా కాదు.. ముందు గ్రామాల్లో అభివృద్ధి చూడాలని హితవు పలికారు. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీస్తామని స్పష్టం చేశారు.రాష్ట్రంలో 56 మంది ఆటో కార్మికులు చనిపోతే ఒక్క కుటుంబాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పరామర్శించలేదని హరీశ్ రావు అన్నారు. ఒక్క కుటుంబాన్ని కూడా ఆదుకోలేదని పేర్కొన్నారు. ఎన్నికల ముందు చెప్పిన ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని నిలదీశారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటివరకు ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదని అన్నారు. రైతుబంధు ఏమైంది? కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఏమైంది? నిరుద్యోగ భృతి ఏమైంది? అని ప్రశ్నించారు. రుణమాఫీ సంగతేంటని నిలదీశారు. సగం మందికి కూడా రుణమాఫీ కాలేదు.. కానీ అందరికీ రుణమాఫీ చేశామని చెప్పుకుంటున్నారని మండిపడ్డారు.సిద్దిపేట ఆటో సొసైటీ దేశానికే ఆదర్శమని హరీశ్‌రావు కొనియాడారు.

# మేం పని చేశాం..కాంగ్రెస్ విధ్వంసం చేస్తుంది!

(నేటి ఫోకస్ న్యూస్), హైదరాబాద్ ప్రతినిధి-సెప్టెంబర్ 30:



సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు ఇచ్చిన హామీలు.. చేసిన వాగ్దానాలు ఏంటీ.. అసలు అధికారంలోకి వచ్చాక చేస్తున్నది ఏంటీ అంటూ ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఆయన సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గత వారం పదిరోజులుగా హైదరాబాద్ మహానగరం, రాష్ట్రంలోని వివిధ పట్టణాల్లో సూర్యాపేట, ఆదిలాబాద్, సంగారెడ్డి ఇతర కొన్ని పట్టణాల్లో చాలాచోట్ల ప్రభుత్వం దుందుడుకు వైఖరి వల్ల చాలామంది పేదలు మా పార్టీ నాయకత్వాన్ని కలిసి పెద్దలు కేసీఆర్‌ను తలచుకుంటూ ఒకటేమాట చెబుతున్నారు. ఎన్నో ఆశలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఈ రకమైన అన్యాయం మళ్లొకసారి కాంగ్రెస్ పార్టీ చేస్తది మేం ఊహించలేదు. ఏ ఇందిరమ్మ చెప్పింది? యే సోనియమ్మ చెప్పింది పేదలకొంపలు కూల్చి పెద్దలకు లాభం చేయమని రేవంత్‌రెడ్డికి ఇవాళ తెలంగాణలోని పేద తల్లులందరూ మా నాయకత్వం వద్దకు వచ్చి మొరపెట్టుకుంటున్నారు' అన్నారు.రాష్ట్రంలోని పేదల తరఫున హృదయపూర్వకంగా తెలంగాణ హైకోర్టుకు ధన్యవాదాలు తెలుపుతున్న. ఈ బుల్డోజర్ రాజ్యాన్ని, బుల్డోజర్ నిర్వాకాన్ని, హైడ్రా కమిషనర్‌ను మందలించి మీరు చట్టపరంగాపోవాలి తప్పా.. ఇష్టానుసారంగా వెళ్తే ఊరుకోం.వందరోజులు వందరోజులు అని చెప్పి.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రూ.2వేల పెన్షన్ రూ.4వేలు అవుతుందని.. మహిళలందరికీ రూ.2500 చొప్పున ఇస్తామని, కల్యాణలక్ష్మిలో రూ.లక్షకు అదనంగా తులం బంగారం ఇస్తామని, మొదటి రోజే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని.. రైతుబంధును రూ.15వేలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారు. అధికారంలోకి వచ్చి 300 రోజులు దాటింది. వందరోజుల్లో చేస్తామని చెప్పిన ఒకమాట చేయకపోగా..300 రోజులు దాటినా ఎప్పుడు చేస్తారో స్పష్టత ఇవ్వకుండా ఇవాళ అక్కరలేని.. అక్కరలేని.. ప్రజలు కోరుకోని.. కాస్మోటిక్ ఎన్‌హాన్స్‌మెంట్ కోసం రూ.1.50లక్షలకోట్లు ఖర్చుపెడుతామంటే రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి.. ఎవరైనా మున్సిపల్ శాఖ చూస్తున్నారో ఆయనను సూటిగా అడుగుతున్నా. మీరు ఏం ఆశించి ఏ చేస్తున్నారు ఈ ప్రాజెక్టు చెప్పాలిసీఎం ఒకమాట అర్థం చేసుకోవాలి. ఒక పేద, మధ్యతరగతి కుటుంబానికి ఇల్లు అనేది జీవితకాలం వారు చేసిన కష్టానికి ప్రతిరూపం. ఇల్లు అనేది ఒక ఎమోషన్. ఇల్లు అనేది ఆ కుటుంబం కలలుగనే ఒక సౌధం. అది ఒక నాలుగు ఇటుకలు, రెండురాళ్లు పెట్టిన కట్టిన కట్టంకాదు. ఇల్లు జ్ఞాపకాల పొదరిల్లు. అలాంటి జ్ఞాపకాన్ని కూల్చేస్తామంటే ఆ బాధ మీకు తెలియది కావచ్చు రేవంత్‌రెడ్డి. కానీ, మాకు తెలుసు. స్వయంగా కేసీఆర్ కుటుంబం రెండుసార్లు డిస్‌ప్లేస్ అయ్యాం.సోషల్ మీడియాలో ప్రచారం చూస్తున్నాం. కాంగ్రెస్ నేత కనుగోలు కొత్త టీం పెట్టారట. వీరంతా ఆక్రమణదారులు. ఎఫ్‌టీఎల్‌లో కట్టారు. బఫర్‌జోన్‌లో కట్టారు. మరి మీ గత కాంగ్రెస్ ప్రభుత్వాలు గుడ్డి గుర్రాల పండ్లు తోమాయా?.. 50 సంవత్సరాల మీ నిర్వాకమే కదా? 50ఏళ్లలో ఏనాడైన పట్టించుకున్నారా? 2016లో మా ప్రభుత్వం వచ్చాక మొదటిసారి హైదరాబాద్‌లో చెరువులు.. వాటి ఎఫ్‌టీఎల్‌లు, బఫర్ జోన్‌లు డ్రా చేస్తూ మొదటిసారి జీవో ఇచ్చిన ప్రభుత్వం మా ప్రభుత్వం. అదివరకు 1956 నుంచి 2016 వరకు సరిగ్గా 60 సంవత్సరాలు. ఒక్కరంటే కాంగ్రెస్, వేరే ప్రభుత్వాలు ఉన్నా కనీసం వాటి బౌండరీలు డ్రా చేసే ప్రయత్నం లేదు. ఎలా పడితే పట్టాలు ఇచ్చారు.. రిజిస్ట్రేషన్లు చేశారు. బఫర్ జోన్లు చూడలేదు.. ఎఫ్‌టీఎల్ చూడలేదు.. పట్టాలు ఇచ్చిపడేశారు. 2024లో వచ్చి మీరంతా ఆక్రమణదారులు.. తప్పు చేశారంటున్నారు.కూల్చివేతలే ఇందిరమ్మ రాజ్యమా? అంటూ కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల తారకరామారావు ధ్వజమెత్తారు. హైడ్రా కూల్చివేతలు, మూసి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.మంత్రులు వచ్చి మూసీ గొప్పదనం ఎందుకు చెప్పడం లేదు. మూసీ ఎంత జనరంజక ప్రాజెక్టు.. అద్భుతమైన ప్రాజెక్టో.. రాష్ట్రం ఎంత మురిసిపోతదరి.. ఎన్ని అద్భుతాలు జరుగతయో ఎందుకు చెప్పడం లేదు. చేతకావడం లేదా? లేక సరుకులేదా? వాస్తవాలు చెప్పేధైర్యం లేక.. అధికారుల వెనుక దాక్కుంటే కుదరదు ముఖ్యమంత్రి. అసలు మేనిఫెస్టో చెప్పు.ఆత్మగౌరవంపై కొడితే.. ఆత్మగౌరవం విషయానికి వస్తే మంత్రి శ్రీధర్‌బాబు.. తెలంగాణ ప్రజలు తిరగబడితే గ్రామాల్లో తిరగలేని పరిస్థితి వస్తుంది.కాకపోతే ఒకటిమాత్రం పక్కా. ఇవాళ వేలాది కుటుంబాలను రోడ్డునపడేసి.. లక్షలాది నిరాశ్రయులను చేసి.. పేద, మధ్యతరగతి ప్రజలు అన్ని అనుమతులు తీసుకొని కట్టుకున్న బిల్డింగ్‌లను కూలగొడుతానంటే మాత్రం బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. ఖచ్చితంగా వారికి అండగా నిలబడుతాం.నేను మున్సిపల్ మినిస్టర్‌గా పని చేసినకాబట్టి అడుగుతున్న. మూసీలో గతంలో ఎవరి ఇబ్బంది పెట్టకుండా మాపాటికి మేం సుందరీకరణ చేశాం. సుందరీకరణ పేదల కడుపుకొట్టకుండా చేయొచ్చు. నాగోల్ దగ్గర ఐదుకిలోమీటర్ల పరిధిలో చేశాం. సీఎం రేవంత్ ఇళు కొడంగల్‌లో సీఎం రేవంత్ ఇళ్లు ఓ కుంటలో ఉన్నదని అన్నారు.పేదల ఇండ్లమీదకు వచ్చే ముందు వారి ఇండ్లు కూలగొట్టి చిత్తశుద్ధి రుజువు చేసుకొని.. పేదల ఇండ్ల మీదకురా. మేం నిర్మాణం పని చేశాం. నువ్వేమో విధ్వంసం చేస్తున్నవ్. మేం అందరూ మావాళ్లేనని పని చేసుకుంటూ వెళ్లాం. ఈయనేమో అసలు గ్యారంటీలు అమలు ఎక్కడ అడుగుతరేమోనని విధ్వంసం చేస్తున్నరు. చెప్పాలంటే ఇంకా చాలానే ఉన్నయ్.ఈ సమావేశంలో మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, గంగుల కమలాకర్, మహమ్మద్ అలీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మీ ఇష్టమొచ్చినట్లు కూల్చేస్తారా?

(నేటి ఫోకస్ న్యూస్), హైదరాబాద్-సెప్టెంబర్30:

హైడ్రా కూల్చివేతల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ హైకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది. హైడ్రా కమీషనర్ రంగానాథ్, ఇతర అధికారులకు చురకలు అంటించింది. అమీన్‌పూర్‌లో ఈ నెల 22న ఆదివారం రోజున ఒక భవనం కూల్చివేతపై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం రంగనాథ్‌ను, అమీన్‌పూర్ తహసీల్దార్‌ను ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు.హైడ్రా చేస్తున్న కూల్చివేతల పట్ల సంతోషంగా లేమని స్పష్టం చేసిన హైకోర్టు.. అసలు హైడ్రాకు ఉన్న చట్టబద్ధత ఏంటని ప్రశ్నించింది. చట్టాన్ని ఉల్లంఘించి కూల్చివేతలు చేస్తున్నారని హైడ్రాకు చీవాట్లు పెట్టింది.పొలిటికల్, ఎగ్జిక్యూటివ్ బాసులను సంతృప్తి పరచడానికి ఇలాంటి చర్యలు చేపట్టడం సరికాదు అని హితవు పలికిన న్యాయస్థానం.. హైడ్రా కేవలం కూల్చివేతలపైన దృష్టి పెట్టిందని దుయ్యబట్టింది. నిర్మాణాలను కూల్చడానికి హైడ్రాకు ఉన్న అర్హత ఏంటని.. ఉన్న పాలసీ ఇంటి చూపించాలి అని మొట్టికాయలు వేసింది.సహజ న్యాయ సూత్రాలను పాటించకుండా ప్రజలను ఎందుకు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ప్రశ్నించిన ధర్మాసనం.. ఇలాగే కొనసాగితే జీవో 99 పై (హైడ్రా జీవో) స్టే విధిస్తామని హెచ్చరించింది.బాధితులకు కనీసం ముందస్తు నోటీసులు కూడా ఇవ్వకుండా.. కేవలం శని, ఆదివారాలు కూల్చివేతలు ఎందుకు చేస్తున్నారని ఫైర్ అయింది. కూల్చివేతలు చేస్తున్న అధికారులు అందరిని చంచల్‌గూడ, చర్లపల్లి జైలుకు పంపిస్తే వింటారు అని ధ్వజమెత్తింది.స్టే ఇచ్చిన తర్వాత కూడా కూల్చివేత చేపడతారా? నోటీసులు జారీ చేసినప్పుడు వారి వాదన కూడా వినరా? శనివారం సాయంత్రం నోటీసు ఇచ్చి.. ఆదివారం కూల్చివేలు చేస్తారా.. సెలవు దినం రోజున విధులకు హాజరై ఎందుకు కూల్చారు? అంటూ న్యాయమూర్తులు పలు ప్రశ్నలు సంధించారు.తహసీల్దార్‌లు అడిగితే సిబ్బంది, యంత్రాలు ఇచ్చేస్తారా? హైడ్రా కమిషనర్‌గా మీకు చట్టం తెలియదా? రేపు చార్మినార్ తహసీల్దార్ హైకోర్టును కూల్చమంటే ఇలాగే వ్యవహరిస్తారా? అని రంగానాథ్‌పై హైకోర్టు ప్రశ్నల వర్షం కురిపించింది.అక్రమ నిర్మాణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ మేం సమర్థించడం లేదు.. చర్యలు చేపట్టాల్సిందే.. కానీ, నిబంధనలు పాటించాల్సిందే అని న్యాయస్థానం స్పష్టం చేసింది. రాత్రికి రాత్రి సిటీని మార్చేద్దాం అనుకుంటే సాధ్యం కాదని గుర్తుంచుకోవాలని సూచించింది.డిజాస్టర్ మ్యానేజ్‌మెం ట్ అంటే ఒక్క కూల్చివేతలే కాదు.. ఇంకా చాలా ఉన్నయ్. అవన్నీ హైడ్రా ఎందుకు చేయడం లేదు అని కోర్టు అడిగింది. మూసీపై మీ ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఏంటీ? ఏదీ లేకుండా కూల్చివేతే పరమావధిగా వ్యవహరిస్తారా? అని చురకలు అంటించింది.హైడ్రా పరిధి ఓఆర్ఆర్ లోపల ఎన్ని చెరువులు, కుంటలు ఉన్నయో తెలుసా? ఎన్నింటికి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌పై తుది నోటిఫికేషన్ ఇచ్చారు అని అడిగింది.. హైడ్రా తీరు తీవ్ర అందోళనకరంగా ఉందని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణలోగా హైడ్రా, తహసీల్దార్ కౌంటర్ దాఖలు చేయాలని విచారణను అక్టోబర్ 15కు వాయిదా వేసింది.

# మిస్టర్ కేటీఆర్.. ఇది కరెక్టా..ఖబడ్దార్?

(నేటి ఫోకస్ న్యూస్), హైదరాబాద్ ప్రతినిధి-సెప్టెంబర్ 30:

తమ పట్ల అసభ్యకరంగా పోస్టులు పెట్టారంటూ మంత్రి కొండా సురేఖ కంటతడి పెట్టారు. "ఓ మహిళనైన నా పట్ల చాలా అసహ్యంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. చాలా ఇబ్బందికరమైన ఫొటోలు పెట్టారు. వీళ్లకు షాదీ ముబారక్ ఎవరు ఇచ్చారు?" అంటూ పోస్ట్ పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు, మంత్రి కొండా సురేఖ ఫొటోలను పెట్టి కొంతమంది సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ఈ పోస్ట్ అసభ్యకరరీతిలో పెట్టి, అవమానించారని సురేఖ ధ్వజమెత్తారు.దఈ పోస్టును చూశాక తాను నిన్నటి నుంచి అన్నం తినలేదని, నిద్రకూడా పోలేకపోయానన్నారు. ఈ పోస్టు పెట్టిన వారి ఇంట్లో కూడా అక్కా, చెల్లె, తల్లి ఉన్నారని, వారింట్లో ఆడపిల్లలు ఉన్నారని గుర్తించాలన్నారు.ఈ పోస్ట్ గురించి మీడియా సమావేశం నిర్వహించిన సురేఖ మాట్లాడుతూ... బీఆర్ఎస్ నాయకులారా, ఖబడ్దార్, అసహ్యంగా పోస్టులు పెడితే ఇక ఊరుకునేది లేదన్నారు. అధికారం పోయిందని బీఆర్ఎస్ వాళ్లు ఇష్టారీతిన పోస్టులు పెడుతున్నారని విమర్శించారు. ఈ పోస్ట్ చూసినప్పటి నుంచి తాను మానసిక ఆవేదనలో ఉన్నానన్నారు. ఓ కార్యక్రమంలో బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఓ చెల్లికి ఇచ్చినట్లు తన మెడలో చేనేత నూలు దండ వేశారని, దీనిని తప్పుగా చిత్రీకరించడం ఏమిటని నిలదీశారు. ఈ ఫొటోపై బీఆర్ఎస్ వాళ్లు ట్రోలింగ్ చేస్తున్నారన్నారు.నీ ఇంట్లో చెల్లిని ఇలాగే అంటే ఊరుకుంటారా? పశువుల కంటే హీనంగా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. కేటీఆర్ , ఈ ఫొటోను మీ చెల్లికి, తల్లికి చూపించు... వాళ్లు కరెక్ట్ అంటే అప్పుడు మాట్లాడు అన్నారు. ఈ ఫొటోకు సంబంధించి తాము సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇది అటవిక ప్రవర్తన అని విరుచుకుపడ్డారు. కేటీఆర్ క్షమాపణ చెప్పాలని లేదంటే బట్టలిప్పి ఉరికిస్తామని హెచ్చరించారు.

# హైడ్రా పేరిట రేవంత్ ప్రభుత్వం వసూళ్లు..

- కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో బీఆర్ఎస్ వేలకోట్లు దండుకుంది
- ఇప్పుడు హైడ్రా పేరుతో కాంగ్రెస్ అదే పనిచేస్తోంది
- బీజేపీ ఎప్పుడూ పేదల పక్షానే ఉంటుంది
- సహాయ మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్

(నేటి ఫోకస్ న్యూస్), హైదరాబాద్-సెప్టెంబర్30:

హైదరాబాద్ నగరంలో అక్రమ నిర్మాణాలపై ప్రధానంగా చెరువుల ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతున్న విషయం తెలిసిందే. నిత్యం నగరంలో ఎక్కడో ఒకచోట కూల్చివేతలు చేపడుతూ వార్తల్లో నిలుస్తోంది సంస్థ. అయితే, తాజాగా హైడ్రాపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో వేల కోట్లు కూడబెట్టినట్లే ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ కూడా హైడ్రా పేరిట వేల కోట్లు దండుకుంటోందని ఆరోపించారు. సోమవారం కరీంనగర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇంకా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నేతృత్వంలో పేదల తరపున నిలబడి పోరాడతామని అన్నారు. బీజేపీ ఎప్పుడూ పేదల పక్షానే ఉంటుందన్న ఆయన.. వారి కోసం ఒంటరిగానే పోరాటం చేస్తామని తెలిపారు. ఇక కరీంనగర్‌లో విలీన గ్రామాలపై కూడా స్పందించిన మంత్రి గ్రామాలను విలీనం చేసే ముందు ప్రభుత్వం స్థానికుల అభిప్రాయం తీసుకోవాలని చెప్పారు. అలాగే తమిళనాడులో సీఎం ఎంకే స్టాలిన్ తనయుడు ఉదయనిధి స్టాలిన్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టడాన్ని విమర్శించారు. తాము ఇలాంటి వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ తరహా వారసత్వ రాజకీయాలు ప్రజా ప్రభుత్వాలకు మంచిది కాదని హితవు పలికారు.








## గిరిజన సంక్షేమ శాఖలో జోనల్ లెవల్

# ఐదు స్థాయి క్రీడాకారుల ఎంపిక

- ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ
- క్రీడల్లో మానసిక శారీరిక ఉల్లాసాన్నిస్థాయి
- ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పొందాలి
- నల్లమల్ల ప్రాంతం నుంచి గిరిజన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో రాణించాలి
- క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లవేళలా తోడ్పాటు అందిస్తుంది



**అచ్చంపేట, (నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి)ం -ఆర్.భరత్ సెప్టెంబర్ 30:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ఆదేశాలతో నాగర్ కర్నూలు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధి ఆధ్వర్యంలో అచ్చంపేట పట్టణంలోని స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఉమ్మడి మహబూబ్నగర్ ఉమ్మడి నల్లగొండ అనగా నాగర్ కర్నూల్ డివిజన్ 6 డివిజన్ 5, గద్వాల జోగులాంబ డివిజన్ 4, నల్లగొండ డివిజన్ 1,2 సూర్యాపేట డివిజన్ 3 కలిపి మొత్తం 6 డివిజనల్ తో జోనల్ 5 స్థాయి క్రీడాకారుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది ఈ ఎంపిక కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాకారుల ఎంపిక పోటీలను ప్రారంభించడం జరిగినది. ఈ జోనల్ స్థాయి ఎంపికకు మొత్తం ఆరు డివిజన్ల నుండి 600 మంది క్రీడాకారులు 8 రకాల అనగా కబడ్డీ కోకో వాలీబాల్ అథ్లెటిక్స్ క్యారమ్స్ ఆర్చరీ టెన్నికాయిడ్స్ ఆటలకు నుండి అండర్ 14, అండర్17 గాను బాల బాలికలకు వేరువేరుగా 248 మందిని క్రీడాకారులకు స్టేట్ లెవల్ కు జరిగే రాష్ట్ర గిరిజన రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎన్నిక కోసం ఎన్నిక చేయడం జరిగినది. ఇక్కడ ఎన్నికైన క్రీడాకారులు నవంబర్ 5 6 7 తేదీల్లో అదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరుకు పంపడం జరుగుతుందని తెలియజేశారు ఉట్నూరులో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో 33 జిల్లాల గిరిజన ఆశ్రమ పాఠశాలలో వసతి గృహాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరుగుతుందని తెలియజేశారు.

నాగర్ కర్నూలు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి ఫిరంగి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జోనల్ లెవెల్ ఐదు క్రీడాకారుల ఎంపికకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులలో క్రీడల వల్ల మానసిక శారీరక ఉల్లాసానిస్తాయని అదేవిధంగా ప్రతి ఒక్క విద్యార్థినీ విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పొంది ఉండాలని మరియు నల్లమల్ల ప్రాంతం నుంచి గిరిజన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించి మీ ప్రాంతానికి మంచి పేరు తేవాలని తెలియజేయడం జరిగినది. అదేవిధంగా క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వము ఎల్లవేళలా అన్ని సహాయ సహకారాలు తోడ్పాటు నిస్తుందని తెలియజేశారు. అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలనలోకి క్రీడలను ఎక్కువ ప్రాధాతన ఇస్తుందని దానిలో భాగంగానే ప్రాథమిక పాఠశాలలకు జిల్లా పాఠశాలలకు కూడా ఎక్కువ శాతం నిధులు కేటాయించడం జరిగిందని తెలియజేశారు. దానితోపాటు అచ్చంపేట పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం ను త్వరలో రాజు ఎన్టీఆర్ స్టేడియం గా మారుస్తానని అదేవిధంగా అన్ని అంగుళాలు సదుపాయాలతో స్టేడియాన్ని తీర్చిదిద్దడం జరుగుతుందని తెలియజేశారు. అదేవిధంగా పీవో రోహిత్ గోపీడి ఈ క్రీడా ఎంపిక కార్యక్రమానికి సందర్శించి క్రీడాకారుల ఆటలను పరివేక్షించడం జరిగినది. అదేవిధంగా క్రీడాకారులకు మరియు అధికారులకు ఆవంచనియ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించడం జరిగినది. ఈ కార్యక్రమానికి అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత మల్లేష్,తాలూకా గిరిజన సేవా సంఘం అధ్యక్షులు లచ్చు నాయక్ , ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ చైర్మన్ మాధవ రెడ్డి,హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్ వన్ మూడవత్ రాములు , డిప్యూటీ డిఈఓ పాతలావత్ శంకర్, ఏ సి ఎం ఓ డి తిరుపతయ్య, నాగర్ కర్నూలు జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ భీమ్లా నాయక్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు నాగరాజు, రాజేందర్,రాములు,బాలస్వామి ,చంద్రశేఖర్,పవన్ ,తిరుపతమ్మ,ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగస్వామి రామ్లాల్ లక్ష్మణ్ భాస్కర్ ముత్యాలు తిరుపతయ్య మల్లేష్ అదేవిధంగా ఉపాధ్యాయ బృందం కాంట్రాక్టు ఉపాధ్యాయులు వ్యాయామ ఉపాధ్యాయులు డైలీ వేజ్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.







### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన

# అచ్చంపేట చైర్మన్‌లు



**అచ్చంపేట, (నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి) -ఆర్.భరత్ సెప్టెంబర్ 30:**





తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అచ్చంపేట నియోజకవర్గం శాసనసభ్యులు చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో అచ్చంపేట నియోజకవర్గం సంబంధించిన నామినేట్ చైర్మన్ పదవులను పొందిన నాగర్ కర్నూల్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు రాజేందర్, మద్దిమడుగు దేవస్థాన కమిటీ చైర్మన్ రాములు ,ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ముంతటి రజిత మల్లేష్, వైస్ చైర్మన్ వెంకటయ్య, అదేవిధంగా అచ్చంపేట మున్సిపాలిటీ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు రాష్ట్ర ముఖ్యమంత్రిని రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి ఒకేను ఇవ్వడం జరిగినది అదేవిధంగా కాంగ్రెస్ పార్టీని వారిని గుర్తించి పదవులు ఇచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ వారిపై ఉన్న నమ్మకాన్ని భరోసాన్ని నిలబెట్టుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తెలియజేయడం జరిగినది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీరందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించడం జరిగింది.



అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసినందుకు చైర్మన్ లందరూ అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.







# పౌల్ట్రీ ఫార్మ్ నుండి గ్రామాన్ని కాపాడండి

## కలెక్టర్‌కు వినతి పత్రం అందించిన గ్రామస్తులు



**రాయపర్తి, ఫోకస్ న్యూస్:**

ఈరోజు రాయపర్తి మండల కేంద్రానికి చెందిన గ్రామస్తులు, యువకులు రాయపర్తి గ్రామ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో..శ్రీ సత్యనారాయణ స్వామి పౌల్ట్రీ ఫామ్ వచ్చే వ్యర్థాలు మంచినీటి చెరువులో కలవడం వలన, త్రాగునీటికి, జల జీవాలకు, చెరువు ఆధారిత కుల వృత్తుల వారికి, పంట పొలాలకు, వినియోగించడం వల్ల గ్రామంలోని ప్రజలు చర్మవ్యాధులు, విష జ్వరాలు, దీర్ఘకాలిక రుగ్మతలతో బాధపడుతున్నారు, గ్రామంలోని సకల జీవాలకు ప్రమాదకరంగా మారిన శ్రీ సత్యనారాయణ స్వామి హేచరీస్ నీ మూసివేయాలని, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిటీ సభ్యులు కలిసి జిల్లా కలెక్టర్ సత్య శారద గారికీ, వినతి పత్రం అందజేశారు, దీనికి సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ గారు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి గ్రామ పరిరక్షణ కమిటీ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం స్టీరింగ్ కమిటీ అధ్యక్షులుగా నియమితులైన సీతా వైద్యం కిషోర్



**ఫోకస్ న్యూస్ ప్రతినిధి, (స్టేట్ కోఆర్డినేటర్ భామిని రఘుపతి)- సెప్టెంబర్ 30:**

సంగారెడ్డి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నుకోవడం జరిగింది ఈ మీటింగ్‌లో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వల్లకాటి రాజకుమార్ ఎక్స్ ప్రెసిడెంట్ కోస్గి యాదగిరి, మెదమ్ బాబురావు, తెలంగాణరాష్ట్ర నాయకులు మారత రమేష్, మచ్చ సుదాకర్, సంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షులు మ్యకం మల్లేష్, అధ్యక్షులు గుండు సత్యనారాయణ ,వర్కింగ్ ప్రెసిడెంట్ గందమల్లె రాజు, జిల్లా స్టీరింగ్ కమిటీ అధ్యక్షులుగా సీత వైద్యం కిషోర్, ప్రదాన కార్యదరిశి మునిపల్లి విశ్వనాదం,కోషదికారి నక్క ప్రబాకర్ తెలంగాణరాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో పటాన్చెరు పద్మశాలి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మన సీత వైద్యం కిషోర్ ప్రముఖ వ్యాపారవేత్త సంగారెడ్డి జిల్లా స్టీరింగ్ కమిటీ అధ్యక్షునిగా అందరి ఏకాభిప్రాయంతో ఎన్నుకోవడం బాధ్యతలు అప్పజెప్పడం జరిగినది. ఈ కార్యక్రమంలో సీతా వైద్యం కిషోర్ రాష్ట్ర నాయకులు కుల పెద్దలు అందరూ కలసి ఆహ్వానిస్తూ ఘనంగా శాలువాలతో సన్మానిస్తూ కృతజ్ఞతలు తెలుపుతూ ఇకనుంచి అన్ని మీరై ముందుండి మీరు సంగారెడ్డి జిల్లా స్టీరింగ్ కమిటీ బాధ్యతలు తీసుకోవడం జరిగినది ఇట్టి కార్యక్రమానికి సంగారెడ్డి నలుమూలల నుంచి జిల్లాల పట్టణాల నాయకులు అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు తెలంగాణ రాష్ట్ర నాయకులు అందరూ భారీ స్థాయిలో హాజరై ఇట్టి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం గా జరుపుకోవడం జరిగినది. సంగారెడ్డి జిల్లా స్థాయి నుంచి అందరూ ఏక అభిప్రాయంతో నన్ను స్టీరింగ్ కమిటీ అధ్యక్షునిగా నాపై నమ్మకం బాధ్యత ఉంచిన కుల బాంధవులందరికీ వేదిక నుంచి పేరుపేరునా నమస్కారాలు తెలుపుతూ మరొకసారి అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలపడం జరిగినది.

